సాక్షి వికారాబాద్

మంగళవారం । 7 । నవంబర్ । 2023

ఆ ఓట్లపైనే ఇద్దరి గురి

2018 ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఉండటంతో ఫలితాలపై మొదటి నుంచి ఉత్కంఠ రేగింది. 10లో▸

16వ 'పరిగి' పందెం

అధికార పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారా? ప్రతిపక్ష అభ్యర్థి గెలుస్తారా అనేది ఓటర్ల నిర్ణయంపైనే ఆధారపడుతుంది. 10లో▸

111 కేసులు నమోదు

అనంతగిరి: ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 111 కేసుల నమోదు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన తనిఖీల్లో రూ. 2,14,14,001 సీజ్ చేసినట్లు తెలిపారు. నగదు తరలించే సమయంలో సరైన పత్రాలు చూపని వారిపై కేసులు నమోదు చేసి డబ్బును సీజ్ చేసినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

మల్లేశంపై బహిష్కరణ వేటు

అనంతగిరి: సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం, సభ్యుడు రవిపై బహిష్కరణ వేటు పడింది. సోమవారం ఈ మేరకు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్రాములు ప్రకటన విడుదల చేశారు. పార్టీ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కారణంగా జిల్లా కార్యదర్శి మల్లేశంను, సభ్యుడు రవిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. వారి ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు వివరించారు.

కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చండి

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



కొటాలగూడ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్రానికి రక్షణ కవచంలా ఉన్న కేసీఆర్ నాయకత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపర్చాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. సోమవారం మండలంలోని కొటాలగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్‌తోనే సాధ్యమని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కమాల్ రెడ్డి, ఎంపీపీ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో చిరుత సంచారం

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరి అడవిలో చిరుత సంచారం కలకలం రేపంది. వికారాబాద్ ఘాట్ రోడ్డులో వాహనచోదకులకు చిరుత కనిపించింది. భయాందోళనకు గురైన వారు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరుణ ఆధ్వర్యంలో ఓ బృందం చిరుత సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించారు. అటుగా వెళ్తున్న డ్రైవర్‌తో మాట్లాడారు. వికారాబాద్ ఘాట్ రోడ్డులో తాను చిరుతను చూసినట్లు డ్రైవర్ తెలిపారు. అది నెమ్మదిగా రోడ్డు దాటిందని అధికారులకు వివరించాడు. చీకటి కావడంతో అధికారులు చిరుత పులి కాలి ముద్రలను గుర్తించలేకపోయారు. రాత్రి వేళ ఈ మార్గంలో ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేయరాదని సూచించారు. అడవిలో నాలుగు సీసీ కెమేరాలు ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరుణ తెలిపారు. కాగా ఇటీవలే దామగుండంలో చిరుత సంచరించిన విషయం తెలిసిందే.



ఓటు పక్కా



ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారులు

వికారాబాద్: ఎన్నికల్లో అతి ముఖ్య ఘట్టం పోలింగ్.. ఇందుకోసం జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సదుపాయల కల్పన వంటి పనులను పూర్తి చేసింది. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకుల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఉన్న సందేహాలను నివృత్తి చేసే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఇందుకోసం 21 బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్లి బటన్ నొక్కితే ఓటు పడే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఎప్పటిలాగే ఈ సారి కూడా ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను వినియోగిస్తోంది. గతంలో వీటిపై పలు రాజకీయ పార్టీలు పలు అనుమానాలను లేవనెత్తడంతో 2018లో వీవీ ప్యాట్‌లు (ఓటర్ వెరిఫికెబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)ను ప్రవేశపెట్టింది. వీటి పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా 21 బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందంలోని సభ్యులు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పర్యటించాయి. అక్కడి ప్రజలకు ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్‌ల ద్వారా నేరుగా అవగాహన కల్పించారు. మీరు వేసిన ఓటు వేసిన గుర్తుపైనే పడిందా లేదా అనే సందేహాల నివృత్తికి చేశారు.

జిల్లాకు సరిపడా ఈవీఎంలు, వీవీప్యాట్‌లు

నవంబర్ 30న జరగనున్న పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు అన్ని పనులు పూర్తి చేశారు. జిల్లాలో 1,133 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. జిల్లాకు అదనంగా 25శాతం ఈవీఎంలు, 40శాతం ఈవీ ప్యాట్‌లు అందుబాటులో ఉంచారు. వీటిపై కలెక్టర్ నారాయణరెడ్డి నేతృత్వంలో అధికారులు శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు.

అనుమానాల నివృత్తి

ఈవీఎంలపై రాజకీయ పార్టీలు అనుమానాలు, సందేహాలు వ్యక్తం చేయడంతో వాటిపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ప్రజల్లో అపోహలను తొలగించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఓటరు తాను వేసిన ఓటు ఎవరికి వేశారో తెలుసుకోవడానికి గాను ఎన్నికల సంఘం గత ఎన్నికల్లో వీవీ ప్యాట్ విధానాన్ని ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేసింది. ఈ సారి కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు. వీటిపై ఓటర్లకు, రాజకీయ పార్టీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నెల రోజుల పాటు శిక్షణ పొందిన 21 బృందాలతో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రతి రోజూ 3 నుంచి 4 గ్రామాల్లో బృందం సభ్యులు తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎలాంటి అవకతవకలకు, ట్యాంపరింగ్‌కు అవకాశం లేదని వివరిస్తూ వచ్చారు. కలెక్టరేట్‌లో సైతం ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాల పనితీరును ప్రదర్శిస్తున్నారు. ఇక్కడ కూడా ఎవరైనా వచ్చి ఓటు హక్కును పరీక్షించుకోవడానికి వెసులుబాటు కల్పించారు. ఈవీఎం ద్వారా వేసిన ఓటు తాము వేసిన గుర్తుకు పడుతుందా లేదా అనే విషయం వీవీ ప్యాట్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవేళ అలా కాని పక్షంలో ఓటింగ్ రోజున సంబంధిత రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది.

ఈవీఎంలపై సందేహాలు వద్దంటున్న అధికారులు

- ఏ గుర్తు పక్కన బటన్ నొక్కితే ఆ గుర్తు వ్యక్తికే ఓటు
- జిల్లాకు 3,120 ఈవీఎంలు
- ఓటింగ్ యంత్రాలపై విస్తృత అవగాహన
- 21 బృందాలతో సందేహాల నివృత్తి
- నాలుగు నియోజకవర్గాల్లో 1,133 పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు


నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రా.జె.	మొత్తం ఓటర్లు
పరిగి	1,27,835	1,24,537	07	2,52,379
వికారాబాద్	1,11,605	1,11,780	13	2,23,398
తాండూరు	1,11,242	1,17,243	10	2,28,495
కొడంగల్	1,14,140	1,16,099	12	2,30,251
మొత్తం	4,64,822	4,69,659	42	9,34,523

ఈవీఎంలను పరిశీలించాం

జిల్లాకు వచ్చిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను ఇప్పటికే ఒకసారి పరిశీలించాం. వాటిని పోలింగ్‌కు బూత్‌లకు పంపడానికి ముందు మరోసారి పరిశీలిస్తాం. జిల్లాకు 3,120 ఈవీఎంలు వచ్చాయి. వీటిలో సాంకేతిక సమస్యలు ఉన్న 150 యంత్రాలను తిప్పి పంపాం. వీటి స్థానంలో వేరే యంత్రాలు రావాల్సి ఉంది. ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో 1,133 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి.

– నారాయణరెడ్డి, కలెక్టర్

'కారు'మబ్బులు!



- తాండూరులో బీఆర్‌ఎస్‌ను వీడుతున్న ద్వితీయ శ్రేణి నాయకులు
- గౌరవం లేదని కొందరు.. పదవులు దక్కలేదని మరికొందరు
- సీనియర్ నాయకులదీ అదే బాట
- కాంగ్రెస్‌లో జోరందుకున్న చేరికలు

తాండూరు: ఎన్నికలకు సమయం సమీపిస్తున్న వేళ రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. అన్ని పార్టీల్లో చేరికలు ఊపందుకున్నాయి. అయితే తాండూరు నియోజకవర్గంలో అధికార పార్టీకి దెబ్బమీద దెబ్బ పడుతోంది. ఆ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు ఒక్కొక్కరుగా కారుకు దూరమవుతున్నారు. ఇటీవల తాండూరు పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు అబ్దుల్ రవూఫ్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి శిబిరంలో చేరారు. అబ్దుల్ రవూఫ్ చాలా సంవత్సరాల పాటు బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడిగా, మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్నారు. నియోజకవర్గంలో పేరున్న నాయకుల్లో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడం వల్లే బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. మరోవైపు నియోజకవర్గంలోని కోట్‌పల్లి, బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పదుల సంఖ్యలో సర్పంచులు, ఎంపీటీసీలు బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. త్వరలో తాండూరు పట్టణానికి చెందిన మహిళా ప్రజాప్రతినిధులు సైతం బీఆర్‌ఎస్ వీడనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే అధికార పార్టీ అభ్యర్థికి ఇబ్బందులు తప్పవని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుల మద్దతు కూడగట్టుకోవడంలో సఫలీకృతం అయ్యారు. అంతేకాకుండా బీఆర్‌ఎస్‌లో కీలకంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు సునీతాసంపత్, విశ్వనాథ్‌గౌడ్ తోపాటు ముఖ్య నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి రప్పించడంలో సక్సెస్ అయ్యారు. ఎన్నికల సమయంలో తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి ఊహించని షాక్‌లు తగులుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన రోహిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు సంబరపడ్డారు. తమకు పార్టీ పదవులు వస్తాయని భావించారు. అయితే వారి ఆశలపై నీళ్లు చల్లుతూ రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌లో అంచెలంచెలుగా పట్టు సాధించారు. 2019 నుంచి ప్రస్తుత ఎన్నికల వరకు తాండూరు రాజకీయాల్లో చక్రం తిప్పుతూ వచ్చారు. అయితే ఓటమితో కుంగిపోని పట్నం మహేందర్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ స్థానాలను గెలిపించి తిరిగి పట్టు సాధించారు. పట్నం మహేందర్‌రెడ్డికి తాండూరులో బలమైన కేడర్ ఉండడమే ఇందుకు కారణం. మున్సిపల్ చైర్‌పర్సన్ తోపాటు, ఎంపీపీలు, జెడ్పీటీసీలను గెలిపించుకున్నారు. రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరిన నాటి నుంచి తాండూరులో పట్నం వర్సెస్ పైలెట్ అన్నట్లు తయారైంది. రెండు వర్గాల మధ్య పోరు తారస్థాయికి చేరింది. అప్పట్లో ఎమ్మెల్సీగా ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి అనుచరగణంపై పైలెట్ సాగిస్తున్న దాడులపై పలుమార్లు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేశారు. పట్నం వర్గీయులను రాజకీయంగా అణచి వేసేందుకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అక్రమంగా కేసులు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పలు మండలాల్లో పైలెట్‌కు వ్యతిరేక వర్గం తయారైంది. సొంత పార్టీకి చెందిన వారిపైనే కక్ష సాధింపులకు పాల్పడటంతో పలువురు నాయకులు తమ ఆస్తులను సైతం కోల్పోయామని ఆందోళన వ్యక్తం చేశారు.

అసంతృప్త జ్వాల

ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత రోహిత్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలను పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నారు. నామినేటెడ్ పదవులు, మున్సిపల్ ఎన్నికల్లో సహకరించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. యాలాల మండలానికి చెందిన ఓ నేత నాలుగు రోజుల క్రితం పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. దీంతో నేరుగా రంగంలోకి దిగిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆయన్ను బుజ్జగించినట్లు సమాచారం. పార్టీకి చెందిన మిగతా ప్రజా ప్రతినిధులు రాజీనామాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

కొంప ముంచనున్న పైలెట్ కోటరీ

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చుట్టూ సీనియర్ నాయకులు కోటరీగా మారారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం మహేందర్ రెడ్డికి వ్యూహకర్తలుగా ఉన్న వారు పైలెట్‌కు అత్యంత సన్నిహితులుగా మారిపోయారు. ఈ నాయకులు చెప్పిందే వేదం. వీరే కార్యాచరణ రూపొందించి పైలెట్‌కు సలహాలు ఇస్తున్నారు. పనుల కోసం పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే వద్దకు వస్తే కోటరీగా ఏర్పడిన నాయకులు కార్యకర్తల పనులకు బ్రేక్ వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే

- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం
- బీఆర్‌ఎస్ నేతల మాటలు నమ్మి మోసపోకండి
- కాంగ్రెస్ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం పెద్దేముల్ మండలం ఉరేంటి తండా, బాయిమీది తండా, అడ్కిచెర్ల, పాషాపూర్, రచ్చకట్ట తండా, జైరాం తండా, తట్టెపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు మేలు జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని, పార్టీ విధానాలు నచ్చక ఎంతో మంది నాయకులు, కార్యకర్తలు ఇతర పార్టీల్లోకి వెళుతున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీ నాయకులు మరోసారి మోసం చేసేందుకు వస్తారని, ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాను పార్టీలు మారే వ్యక్తిని కాదని, కాంగ్రెస్ వీడితే రాళ్లతో తరిమి కొట్టాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఏపీ సీఎం కాగానే లక్ష రూపాయల రుణమాఫీపై మొదటి సంతకం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టగానే వైఎస్సార్ తరహాలో రూ.2 లక్షల రుణమాఫీపై మొదటి సంతకం ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికారాన్ని అడ్డు పెట్టుకొని భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని అన్నారు. తాను ప్రజలను మోసం చేసే వ్యక్తి కాదన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో డబుల్ బెడ్ రూమ్‌లు, రైతు రుణమాఫీ, దళిత బంధు, మూడు ఎకరాల భూ పంపిణీ ఎంత మందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి మోసపోవద్దని, ఆ పార్టీని చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, వైస్ ఎంపీపీ అనురాధ, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, తాండూరు ఏ-బ్లాక్ ప్రసిడెంట్ నర్సింలు, సీనియర్ నాయకుడు మైపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, మల్లేశం, నాయకులు రియాజ్, ఎల్లారెడ్డి, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

నా గెలుపు బాధ్యత మీదే



ప్రజలకు అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి

- రెండేళ్లలో రాష్ట్రం దశ, దిశ మారుతుంది
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేత

కొడంగల్: నా గెలుపు బాధ్యత మీదే.. ఈ ఎన్నికల్లో కొడంగల్ సత్తా ఏంటో చూపించండి అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ తరఫున కొడంగల్‌లో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కేటీఆర్ దత్తత పేరుతో కొడంగల్‌కు మోసం చేశారని, కృష్ణా రైల్వే లైన్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో జూనియర్ కళాశాలలు, కృష్ణా జలాలు తెచ్చి ఇక్కడి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ సన్నాసులు ఇవాళ ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఈ ఎన్నికలు ఆషామాషీ ఎన్నికలు కావని, ఇక్కడి ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చే ఎన్నికలన్నారు. దేశ ముఖ చిత్రంలో కొడంగల్‌కు గుర్తింపు తెచ్చే ఎన్నికలన్నారు. గెలిచిన రెండేళ్లలో నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పూర్తి చేసి నీళ్లు తెస్తానని హామీ ఇచ్చారు. ఏడాదిలో మహబూబ్‌నగర్ నుంచి చించోళి జాతీయ రహదారి పూర్తి చేస్తానని, ఆడబిడ్డలకు ప్రత్యేక డిగ్రీ కళాశాలలను తెస్తానని, అండగా నిలబడే ప్రజల ఆత్మ గౌరవం నిలబెట్టే బాధ్యత తనదేనని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

కొడంగల్ రూరల్: రేవంత్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా సోమవారం కొడంగల్ పట్టణం జనసంద్రంగా మారింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఆలయాల్లో పూజలు చేసి ర్యాలీగా కొడంగల్‌కు చేరుకున్నారు. రావులపల్లి సర్పంచ్ రమేష్‌రెడ్డి దేశ్‌ముఖ్ శివలింగానికి, ఆంజనేయస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్సాపూర్‌లో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా కొడంగల్‌కు చేరుకున్నారు. రేవంత్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా గాడిబాయి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నామినేషన్ వేయడానికి బయలుదేరారు. వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావడంతో కొడంగల్ జన సంద్రంగా మారింది.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

- మూడో సారీ బీఆర్‌ఎస్‌దే అధికారం
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదని, ఆ పార్టీ నాయకులు ఇచ్చే హామీలకు గ్యారంటీ లేదని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం పట్టణంలోని 11వ వార్డులో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు బూటకమన్నారు. కర్ణాటకలో ఇలానే చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. మూడో సారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ప్రజలు జీవన విధానం మారిందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం బంగారు తెలంగాణ అవుతోందని అన్నారు. రైతులు, పేదల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు వివరించారు. కాంగ్రెస్, బీజేపీ చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, కోఆప్షన్ జిల్లా మాజీ సభ్యుడు మీర్ మహ్మద్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మునీర్, కృష్ణ, రవీందర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఆ ఓట్లపైనే ఇద్దరి గురి!

నియోజకవర్గంలో 2018 ఎన్నికల ఫలితాల ఆధారంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారానికి పదును పెట్టారు. గతంలో కాంగ్రెస్ రెబల్ సాధించిన ఓట్లను తమవైపునకు మలుచుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు వ్యూహాలకు ప్రతివ్యూహాలు రచిస్తున్నారు.

- 2018లో రెబల్స్, ఇండిపెండెంట్లకు రెండు శాతం ఓట్లు
- నియోజకవర్గాన్ని వీడిన ఏసీఆర్
- ఆయన ఓటు బ్యాంక్ ఎవరికోనని చర్చలు





బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్



కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్ అర్బన్: 2018 శాసన సభ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఉండటంతో ఫలితాలపై మొదటి నుండి ఉత్కంఠ రేగింది. టీఆర్ఎస్ నుంచి డాక్టర్ మెతుకు ఆనంద్, కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్, ఏఐఎఫ్‌బీ అభ్యర్థిగా మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పోటీలో నిలిచారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే తీవ్ర పోటీ ఉంటుందని నియోజకవర్గ ప్రజలు భావించారు. మాజీ మంత్రి చంద్రశేఖర్ హస్తం పార్టీ టికెట్ కోసం చివరి వరకు ఎదురుచూసినా నిరాశే మిగిలింది. దీంతో ఆయన సింహం గుర్తుపై బరిలో నిలిచారు. గతంలో ఆయన ఈ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించడంతో పాటుగా మంత్రిగా పనిచేశారు. దీంతో ఆయనకంటూ ఓ వర్గాన్ని తయారు చేసుకున్నారు. ఆయన పోటీలో ఉండడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకులంతా పార్టీని వీడి ఏసీఆర్ వెంట నడిచారు. ఎన్నికలు సమీపిస్తున్నా కొద్దీ ద్విముఖ పోటీ కాస్త త్రిముఖ పోరుగా మారింది. ప్రధాన పార్టీలకు తగ్గకుండా ఆయన ప్రచారంలో దూసుకెళ్లారు. ఒకానొక సందర్భంలో ఆయన విజయం ఖాయమనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా చక్కర్లు కొట్టాయి.

రెండు శాతం ఓట్ల తేడానే

2018లో అధికార టీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత, అసమ్మతి లేక పోవడంతో ప్రస్తుత ఎమ్మెల్యే ఆనంద్ తొలిసారి ఎన్నికల బరిలో ఉండడం కారు పార్టీకి కలిసి వచ్చింది. ప్రభుత్వ పథకాలు అందుకున్న ప్రతీ లబ్ధిదారుడు టీఆర్ఎస్‌కు అండగా నిలిచే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్ గతంలో మూడు సార్లు ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవంతో గట్టి పోటీ ఇచ్చారు. నియోజకవర్గంలో 1,50,192 ఓట్లు పోల్ అవ్వగా టీఆర్ఎస్ అభ్యర్థికి 59,971 ఓట్లు సాధించగా 39.47 శాతం ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థికి 56,879 ఓట్లు పోలయ్యాయి. ఈయన 37.44 శాతం ఓట్లు సాధించారు. అంటే ఇద్దరి మధ్యల ఓట్ల శాతం కేవలం 2.2శాతమే తేడా ఉంది. ప్రస్తుత ఎన్నికల్లోనూ అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య నువ్వానేనా అనే రీతిలో పోటీ ఉంటుందని ఓటర్లు చర్చించుకుంటున్నారు.

ఇండిపెండెంట్ ఓట్లు ఎవరికి

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులకు ఓట్లేసిన ప్రజానికం ఈ ఎన్నికల్లో ఎవరివైపు మొగ్గు చూపుతారనే చర్చ జోరుగా సాగుతుంది. ప్రస్తుత ఎన్నికల్లో ఆ స్థాయిలో ఓట్లు సాధించే ప్రత్యర్థులు ఇప్పటి వరకు నామినేషన్ దాఖలు చేయలేదు. ఈ సారి బీఎస్పీ, బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉన్నా ఎంత మేరా ఓట్లు సాధిస్తారనే స్పష్టత లేదు. ఇండిపెండెంట్ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్‌కు 23,908 ఓట్లు సాధించగా.. 15.74శాతం ఓటింగ్ నమోదయింది. ఈయన ఓటు షేరింగ్ కాంగ్రెస్‌కే అనే చర్చలు కొనసాగుతున్నాయి.

గతంలో చంద్రశేఖర్ రెబల్‌గా పోటీలో ఉండటంతోనే ప్రసాద్ కుమార్ ఓటమి పాలవ్వగా.. ఈ సారి చంద్రశేఖర్ పోటీలో లేకపోవడంతో ప్రసాద్ కుమార్‌కు కలిసొస్తుందనే ప్రచారం జరుగుతుంది. మరో ఇండిపెండెంట్ అభ్యర్థి పెండ్యాల అనంతయ్య ట్రక్కు గుర్తుపై 3,214 ఓట్లను సాధించాడు. ఈయనకు 2.12 ఓటింగ్ శాతం నమోదయింది. ఈయనకు ట్రక్కు గుర్తు ఉండటంతో కారు గుర్తుకు పడాల్సిన ఓట్లు ట్రక్కుకు పడ్డాయనే ప్రచారం కూడా సాగింది.

ధరావతు కోల్పోయిన బీజేపీ, బీఎస్పీ

2018 ఎన్నికల్లో నియోకవర్గంలో నాలుగో స్థానంలో ఉంటామనుకున్న బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదు. బీజేపీ తరఫున సాయికృష్ణ పోటీ చేశారు. ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థుల కంటే తక్కువ ఓట్లు సాధించారు. కేవలం 1973 ఓట్లతో 1.30 శాతం ఓటింగ్ నమోదయింది. బీఎస్పీ నుంచి పోటీ చేసిన చిట్టంపల్లి బాలయ్యకు కేవలం 1401 ఓట్లు, మరో ఇండిపెండెంట్ అభ్యర్థి జి.చంద్రశేఖర్ 1,335 ఓట్లు సాధించాడు. నోటాకు 1,511 ఓట్లు పడ్డాయి. మాజీ మంత్రి చంద్రశేఖర్‌ను మినహాయిస్తే నలుగురు ఇండిపెండెంట్లు, నోటాకు పడ్డ ఓట్ల శాతం ఆరు మాత్రమే. ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఐదు నుంచి ఆరుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులు పోటీలో ఉండే అవకాశం ఉండటంతో తిరిగి వీరికి ఆరు శాతం వారికే అంటూ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ లెక్కలు ఎలా ఉన్నా అధికార ప్రతిపక్ష నాయకులు 2018 ఎన్నికల ఓట్ల శాతాన్ని పరిగణలోకి తీసుకొని ప్రస్తుత ఎన్నికల వ్యూహాన్ని అల్లుతున్నారు. ప్రస్తుతం మాజీ మంత్రి డాక్టర్ ఏసీఆర్ పోటీలో లేక పోవడంతో ఆయన సాధించిన 23,908 ఓట్లను దక్కించుకునేందుకు కారు, కాంగ్రెస్‌లు పోటీ పడుతున్నాయి. వారు ఎవరికి ఓటేస్తే గెలుపు వారిదేనని నియోజకవర్గంలో చర్చ కొనసాగుతోంది.

పార్టీ	అభ్యర్థి	సాధించిన ఓటు	ఓట్ల శాతం
టీఆర్ఎస్	మెతుకు ఆనంద్	59971	39.47
కాంగ్రెస్	గడ్డం ప్రసాద్ కుమార్	56879	37.44
ఏఐఎఫ్‌బీ	డాక్టర్ ఎ.చంద్రశేఖర్	23908	15.74
స్వతంత్ర	పెండ్యాల అనంతయ్య	3214	2.12
బీజేపీ	సాయి కృష్ణ	1973	1.30
బీఎస్పీ	చిట్టంపల్లి బాలయ్య	1401	0.92
స్వతంత్ర	జి. చంద్రశేఖర్	1335	0.88

గులాబీలో ముసలం

- జాడ లేని జెడ్పీ వైస్ చైర్మన్
- పార్టీ కార్యక్రమాలకు, ప్రచారానికి దూరంగా విజయ్‌కుమార్
- అదేబాటలో పలువురు సీనియర్లు..?





విజయ్‌కుమార్

మోమిన్‌పేట: మరో మూడు రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ ముగియనున్నా అధికార పార్టీకి చెందిన జెడ్పీవైస్ చైర్మన్, మోమిన్‌పేట జెడ్పీటీసీ సభ్యుడు బి.విజయ్‌కుమార్ మౌనంగా ఉన్నారు. మండల పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో ప్రచారం ముగిసినా నేటికీ తెరపైకి రాలేదు. ఆత్మీయ సమ్మేళనం, బైక్ ర్యాలీ కార్యక్రమాలకు సైతం గైర్హాజరయ్యారు. నాన్ లోకల్ అయినప్పటికీ పార్టీ పెద్దల పిలుపు మేరకు ఆయన్ను జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిపించుకుంటే ఆయన ప్రజలకు దూరంగా ఉడడం పార్టీ శ్రేణులు జీర్ణించుకోవడం లేదు.

టికెట్ ఆశించి.. భంగపడి

వికారాబాద్ అసెంబ్లీ టికెట్‌ను ఆశించిన విజయ్‌కుమార్ చివరివరకు ప్రయత్నాలు చేశారు. పార్టీ అధిష్ఠానం సిట్టింగులకే మొగ్గు చూపడంతో ఆయన అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ కోసం పనిచేస్తానని ప్రకటించిన ఆయన నేటికీ ప్రచారంలో పాల్గొనక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని పలువురు సీనియర్లు సైతం అదేబాటలో నడుస్తున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో పార్టీని ముందుండి నడిపిన నరోత్తం రెడ్డి ఎమ్మెల్యే ఆనంద్‌తో పొసగక పార్టీకి దూరంగా ఉన్నారు. ఇదే అదునుగా భావించిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నర్సింలుగుప్తా, కాంగ్రెస్ నుంచి చీమలదరి సర్పంచ్ నర్సింహారెడ్డి, మోమిన్‌పేట్ పీఏసీఎస్ చైర్మన్ విష్ణు వర్ధన్‌రెడ్డి, పార్టీ ప్రస్తుత మండల అధ్యక్షుడు వెంకట్ తదితరులు గులాబీ గూటికి చేరారు. పాతా కొత్త సంయుక్తంగా పార్లమెంట్ ఎన్నికలకు పనిచేశారు. ఇన్నాళ్లు మౌనంగా ఉన్న నేతలు ఎన్నికల వేళ నరోత్తంరెడ్డి హస్తం కండువా కప్పుకున్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేసినపుడు సరే అన్న నేతలు కుదురుకోవడం లేదు. వారి మౌనంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

16వ 'పరిగి' పందెం

నామినేషన్ల ఘట్టం సాగుతోంది. మరో మూడు రోజుల గడువు ఉండడంతో అభ్యర్థులు వేగం పెంచారు. పరిగి నుంచి మూడు పార్టీలు అభ్యర్థులకు బీఫాంలు ప్రకటించడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.



అన్ని పార్టీల లిస్టు విడుదల

- బీఫాంలు అందుకున్న అభ్యర్థులు
- జోరందుకున్న ప్రచారం



కొప్పుల మహేశ్‌రెడ్డి (బీఆర్ఎస్ అభ్యర్థి.)



టి రామ్మోహన్‌రెడ్డి (కాంగ్రెస్ అభ్యర్థి)



మారుతి కిరణ్ (బీజేపీ అభ్యర్థి)

పరిగి: ఎమ్మెల్యేగా ఎవరు గెలుస్తారు..? అధికార పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారా..? ప్రతిపక్ష అభ్యర్థి గెలుపును సొంతం చేసుకుంటారా అనేది ఓటర్ల నిర్ణయంపైనే ఆధారపడుతుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఖరారు చేసి బీఫాంలు అందించింది. దీంతో అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకువెళ్తున్నారు. అటు నగరానికి.. ఇటు కొడంగల్‌కు సమీపంలో ఈ సెగ్మెంట్ ఉండడంతో అన్ని నియోజకవర్గాల ప్రభావం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. 1952లో నియోజకవర్గం ఏర్పడింది మొదలు ఇక్కడ ఏడుగురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. 1952లో షాజహాన్ బేగం ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా.. కొప్పుల హరీశ్వర్ రెడ్డి ఐదుసార్లు వరుసగా శాసనసభ గడప తొక్కారు. కమతం రాంరెడ్డి మూడు సార్లు, అహ్మద్‌షరీఫ్ రెండు సార్లు, మరో నలుగురులు ఒక్కోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మొదట్లో బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించడంతో పాటుగా.. కాంగ్రెస్ నుంచి రామ్మోహన్‌రెడ్డికే వస్తుందని వారు ఇరువురూ ప్రచారంలో ముందున్నారు. బీజేపీ నుంచి ఆశావహులు పదుల సంఖ్యలో ఉండడంతో టికెట్ కేటాయించే వరకు ప్రచారం ప్రారంభించలేదు. టికెట్ కేటాయించింది మొదలు ముఖ్య నాయకులను కలవడం మండలాల వ్యాప్తంగా ప్రచారం నిర్వహించడం మొదలు పెట్టారు. బీఎస్పీ నుంచి ఆనంద్ ప్రచారం చేసుకుంటున్నారు. టీడీపీ నుంచి కాసాని వీరేశ్ బరిలో ఉంటున్నాని చెప్పి తన వర్గాన్ని ఏర్పాటు చేసుకుని మండలాలు, గ్రామాల వారీగా కార్యాలయాలను ప్రారంభించారు. ఇటీవల కాసాని జ్ఞానేశ్వర్ టీడీపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో కాసాని వర్గం ఎటు వైపు పనిచేయాలనే సందిగ్ధంలో పడిపోయారు. కాసాని వర్గాన్ని ఆయ పార్టీల నాయకులు తమ పార్టీకి మద్దతు తెలపాలని కోరుతున్నట్టు సమాచారం.

విజయం మాదే..

నియోజవర్గంలో జరిగిన ఎన్నికల్లో ఆరు సార్లు కాంగ్రెస్ , రెండు సార్లు కాంగ్రెస్ రెబల్స్ విజయం సాధించారు. ఐదు సార్లు టీడీపీ గెలుపొందింది. ఒక సారి టీఆర్ఎస్ కైవసం చేసుకోగా.. రెండు సార్లు స్వతంత్ర అభ్యర్థులు సత్తా చాటారు. 2023లో విజయం మాదంటే మాదే అని అన్ని పార్టీలు ధీమాతో ఉన్నాయి.

ఆందోళన వద్దు



పామెన భీంభరత్

చేవెళ్ల:టికెట్ తనకే ఇచ్చారని.. బీఫాం కూడా తనకే వస్తోందని భీంభరత్ రాత్రి గాంధీ భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం బీఫాం ఇస్తామని చెప్పారన్నారు. పార్టీ శ్రేణులు ఆందోళన చెందాల్సిన పని లేదని.. విజయం కాంగ్రెస్ పార్టీదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మూడో జాబితాలో మార్పు లేకపోవడంతో..

తాజాగా సోమవారం ప్రకటించిన మూడో జాబితాలో బోథ్, వనపర్తి స్థానాలకు రెండో జాబితాలో ప్రకటించిన అభ్యర్థులను అధిష్టానం మార్పు చేసింది. చేవెళ్ల నుంచి అలాంటిదేమీ లేకపోవడంతో బీఫాం తప్పనిసరి భీంభరత్‌కే వస్తుందని ఆయన వర్గీయులు నమ్మకంగా ఉన్నారు.

'పట్నం'లో టైట్ ఫైట్



విప్లవాల పురిటిగడ్డ.. కమ్యూనిస్టుల కంచుకోట.. రాచకొండ గుట్టలు నిలయంగా సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటం.. నియోజకవర్గ సొంతం. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావానికి ముందుగానే ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్‌గా ఉండేది. అంతటి చరిత్ర కలిగిన ఈ గడ్డపై ప్రధాన పార్టీలన్నీ తమ జెండాలు ఎగురవేశాయి.



ఇబ్రహీంపట్నం టౌన్ ముఖచిత్రం

- ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవానికి ముందే అసెంబ్లీ సెగ్మెంట్
- 11 మంది ఎమ్మెల్యేల్లో మంత్రులుగా ఇద్దరికే అవకాశం
- హ్యాట్రిక్ విజయాలు దక్కించుకున్న లక్ష్మీనర్సయ్య, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ప్రస్తుత ఎన్నికల బరిలో బలమైన నేతలు
- నలభై ఏళ్ల కల సాకారం కోసం కాంగ్రెస్
- పట్టు కోసం బీఆర్ఎస్



మస్కు నర్సింహ, మాజీ ఎమ్మెల్యే



కొండ్రు పుష్పలీల, మాజీ మంత్రి



కొండిగారి రాములు మాజీ ఎమ్మెల్యే



మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి



కె. సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: నగరానికి ఆనుకుని ఉన్న ఈ నియోజకవర్గంలో అన్ని పార్టీలు కాలానుగునంగా తమ ప్రాబల్యాన్ని చాటాయి. ఈ సెగ్మెంట్ హస్తం చేజారి రనాలుగు దశబ్దాలు కావొస్తుండగా.. టీడీపీ, సీపీఎంలు మూడు దశాబ్దాలుగా విజయం సాధిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం 'కారు' 2018లో బోణీ కొట్టింది. 1952లో హైదరాబాద్ రాష్ట్రంలో ఈ నియోజకవర్గం ఉండేది. ఇప్పటి వరకు 16సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, మూడుసార్లు సీపీఎం, ఒకసారి టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. 1978 నుంచి 2004 వరకు ఈ స్థానం ఎస్సీ రిజర్వ్. ఇక్కడ ప్రాతినిథ్యం వహించిన 11మందిలో కేవలం ఇద్దరికి మాత్రమే అమాత్య పదవి వరించింది. 15ఏళ్ల పాటు సీపీఎం ఎమ్మెల్యేలు ఈ నియోజకవర్గాన్ని శాసించారు. రోజురోజుకు కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గుతుంది. కాంగ్రెస్, టీడీపీల పొత్తుల ప్రభావం కారణంగా కమ్యూనిస్టుల ప్రాబల్యం మసకబారింది.

1952లో ద్విసభ్య శాసనసభ్యులు

1952లో జరిగిన ఈ ఎన్నికల్లో ద్విసభ్య శాసనసభ నియోజకవర్గంగా ఉండేది. తూర్పు, పడమటి ప్రాంతాల నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించేవారు. అప్పట్లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉండటంతో 1952 అసెంబ్లీ ఎన్నికల్లో పీడీఎఫ్ నుంచి పిల్లయిపల్లి పాపిరెడ్డి (తూర్పు భాగం), కాంగ్రెస్ నుంచి ఎంబీ గౌతమ్ పడమటి బాగం(ఇబ్రహీంపట్నం ప్రాంతం) నుంచి ఎమ్మెల్యేలుగా పనిచేశారు.1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా అవతరించిన అనంతరం ఏకసభ్య నియోజకవర్గంగా మారింది.

ఇద్దరు అభ్యర్థులను వరించిన హ్యాట్రిక్

1952 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎంబీ గౌతమ్, పీడీఎఫ్ నుంచి పిలాయిపల్లి పాపిరెడ్డి, 1957, 1962, 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన లక్ష్మీనర్సయ్య హ్యాట్రిక్ విజయం సాధించారు. 1972 ఎన్నికల్లో హస్తంపై అనంతరెడ్డి గెలుపొందింది. 1978 నుంచి ఎస్సీ రిజర్వ్డ్ స్థానంగా మారింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి సుమిత్రదేవి అసెంబ్లీ మెట్లెక్కారు. ఆమె మృతి చెందడంతో 1981లో నిర్వహించిన ఉప ఎన్నిక, 1983 సాధారణ ఎన్నికల్లో ఏజీ కృష్ణ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ప్రభంజనం వీస్తున్న తరుణంలో 1982లో కాంగ్రెస్ జెండా ఎగరడ గమనార్హం. అనంతరం నియోజవర్గ రాజకీయాల్లో మార్పు వచ్చింది. 1985లో ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ మధ్యంతర ఎన్నికలకు వెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఏ అసెంబ్లీ ఎన్నికలోనూ కాంగ్రెస్ ఈ స్థానాన్ని దక్కించుకోలేకపోయింది. 1985 ఎన్నికల్లో కె.సత్యనారాయణ టీడీపీ నుంచి గెలుపొందారు. 1989, 1994 ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్షంగా ఉన్న సీపీఎం నుంచి కొండిగారి రాములు, 1999లో సైకిల్‌పై కొండ్రు పుష్పలీల, 2004లో కాంగ్రెస్ మిత్రపక్షంగా ఉన్న సీపీఎం నుంచి మస్కు నర్సింహ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 2009, 2014 ఎన్నికల్లో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి టీడీపీ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన సైకిల్ దిగి కారెక్కారు. 2018లో టీఆర్ఎస్ నుంచి హ్యాట్రిక్ విజయం సాధించారు. డీలిమిటేషన్‌లో మహేశ్వరం, కందుకూరు మండలాల స్థానంలో హయత్‌నగర్ (అబ్దుల్లాపూర్‌మెట్) మండలం ఇందులో కలిసింది. దీంతో 2009 నుంచి మళ్లీ జనరల్ స్థానంగా మారింది. నియోజకవర్గంలో ఇద్దరు మహిళలు సుమిత్రాదేవి, పుష్పలీల ఎమ్మెల్యేలుగా ప్రాతినిథ్యం వహించారు.

ఇద్దరు మంత్రులు

నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేల్లో ఇద్దరికి మంత్రులు పదువులు వచ్చాయి. కాంగ్రెస్ నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన లక్ష్మీనర్సయ్య, టీడీపీ నుంచి ఒకసారి గెలిచిన కొండ్రు పుష్పలీల మంత్రులుగా పనిచేశారు.

హస్తంలో గ్రూపు రాజకీయాలు

1985 నుంచి కాంగ్రెస్ అపజాయానికి కారణం గ్రూపు రాజకీయాలే. సెగ్మెంట్‌లో బలమైన పార్టీ కేడర్ ఉన్నా నాయకుల మధ్య సఖ్యత లేక పార్టీ గెలుపునకు అడ్డు కట్ట వేస్తున్నాయి.

'కమలం' తహ తహ

నియోజవకర్గంలో పట్టు సాధించేందుకు బీజేపీ ఏళ్ల నుంచి తహ తహలాడుతోంది. ప్రజల్లో పట్టున్న నాయకుడు ఈ నియోజకవర్గంలో లేకపోవడం ఆ పార్టీకి సమస్యగా మారింది. క్షేత్రస్థాయిలో ఇప్పటికీ పార్టీకి కేడర్ లేకపోవడం గమనార్హం.

ద్విముఖ పోరు

'పట్నం'లో మరోమారు కారు జోరు చూపించాలని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రచారం ముమ్మరం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ దక్కక మల్‌రెడ్డి రనేనుగు గుర్తుపై పోటీ కేవలం 356 ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశారు. దీంతో ఈ ఎన్నికలు మంచిరెడ్డి, మల్‌రెడ్డి మధ్య హోరాహోరి పోరు జరుగనున్నదని విశ్లేషకులు అంటున్నారు.

నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ
1952	ఎంబి గౌతమ్	కాంగ్రెస్
-	పిలాయిపల్లి పాపిరెడ్డి	పీడీఎఫ్
1957	ఎంఎన్.లక్ష్మీనర్సయ్య	కాంగ్రెస్
1962	ఎంఎన్.లక్ష్మీనర్సయ్య	కాంగ్రెస్
1967	ఎంఎన్.లక్ష్మీనర్సయ్య	కాంగ్రెస్
1972	ఎన్. అనంతరెడ్డి	కాంగ్రెస్
1978	సుమిత్రాదేవి	కాంగ్రెస్
1981	ఏజీ కృష్ణ(ఉప ఎన్నిక)	కాంగ్రెస్
1983	ఏజీ కృష్ణ	కాంగ్రెస్
1985	కె.సత్యనారాయణ	టీడీపీ
1989	కొండిగారి రాములు	సీపీఎం
1994	కొండిగారి రాములు	సీపీఎం
1999	కొండ్రు పుష్పలీల	టీడీపీ
2004	మస్కు నర్సింహ	సీపీఎం
2009	మంచిరెడ్డి కిషన్‌రెడ్డి	టీడీపీ
2014	మంచిరెడ్డి కిషన్‌రెడ్డి	టీడీపీ
2018	మంచిరెడ్డి కిషన్‌రెడ్డి	టీఆర్ఎస్

నామినేషన్ 'సిత్రాలు'



చంద్రశేఖర్ ముదిరాజ్ తరఫున నామినేషన్ వేస్తున్న బీఎస్పీ నాయకులు

తాండూరు అసెంబ్లీ స్థానానికి సోమవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. బీఎస్పీ నుంచి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ తరఫున పార్టీ నాయకులు, గౌరి శ్రీశైలం డీఎస్పీ నుంచి, తెలంగాణ యూత్ ఫోర్స్ నుంచి బింగి రాములు, స్వతంత్ర అభ్యర్థులుగా మహ్మద్ ముస్తఫా రిజ్వాన్, శ్రీగోపాల్, బి.రాములు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అంతారం గ్రామానికి చెందిన మహ్మద్ ముస్తఫా రిజ్వాన్ వినూత్నంగా హామీలు నెరవేర్చకుంటే జైలుకు పంపాలంటూ అడ్వకేట్ నోటరీ పత్రాన్ని తయారు చేయించారు. పట్టణానికి చెందిన గోపాల్ ఐదోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ సమర్పించారు. పరిగి బీజేపీ అభ్యర్థి మారుతి కిరణ్ అనుచరులు ఆయన తరఫున నామినేషన్ వేశారు. తెలంగాణ రాజ్య సమితి అభ్యర్థిగా లాలయ్య నామినేషన్ పత్రాలు సమర్పించారు.

– తాండూరు టౌన్/పరిగి



తాండూరు టౌన్: నోటరీ చేయించిన హామీ పత్రాన్ని చూపుతున్న మహ్మద్ ముస్తఫా రిజ్వాన్



పరిగి: మారుతికిరణ్ తరుపున నామినేషన్ దాఖలు చేస్తున్న అనుచరులు

సబిత.. మంత్రిగా ఘనత!

అమాత్య పదవుల్లో సరికొత్త రికార్డు

హుడాకాంప్లెక్స్: చేవెళ్ల చెల్లెమ్మగా.. తొలి మహిళా హోం మంత్రిగా... గెలిచిన ప్రతీసారి మంత్రి పదవి చేపట్టి ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ ప్రత్యేకంగా నిలిచారు. విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి. భర్త మరణంతో అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె దివంగత సీఎం వైఎస్సార్ ప్రోత్సాహంతో రాజకీయాల్లో రాణిస్తూ తనదైన ముద్ర వేసుకుంటున్నారు.

➡ ఉమ్మడి రాష్ట్రంలో 1999లో సబితారెడ్డి భర్త పి.ఇంద్రారెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి కేఎల్ఆర్‌పై విజయం సాధించారు. 2000లో ఆయన అకాల మరణంతో ఆమె అనూహ్యంగా రాజకీయ అరంగేట్రం చేశారు. ఉప ఎన్నికతో ప్రస్తావాన్ని ప్రారంభించిన ఆమె కేఎల్ఆర్‌ను ఓడించి అసెంబ్లీలో అగుడుపెట్టింది.

➡ 2004లోనూ పోటీలో నిలిచిన ఆమె టీడీపీ అభ్యర్థి ఎస్.భూపల్‌రెడ్డిపై విజయం సాధించారు. అనంతరం ఆమె మంత్రి వర్గంలో చోటు దక్కించుకుని గనుల శాఖ మంత్రిగా మెప్పించారు.

➡ 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నుంచి సబితారెడ్డి మూడోసారి బరిలో నిలిచారు. ఈ ఎన్నికలో మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగి టీడీపీ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డిపై ఘన విజయం సాధించారు. దీంతో వైఎస్ఆర్ ప్రోత్సహించి ఆమెకు హోంమంత్రి పదవిని కట్టబెట్టడంతో తొలి మహిళా హోంమంత్రిగా రికార్డు సృష్టించారు. అనంతరం 2014 ఎన్నికలకు ఆమె దూరంగా ఉన్నారు.

➡ 2018 ఎన్నికల్లో మరోసారి మహేశ్వరం నుంచి పోటీ చేసిన సబితారెడ్డి విజయం సాధించారు. అనంతరం ఆమె గులాబీ తీర్థం పుచ్చుకుని కేసీఆర్ మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. రాష్ట్రంలో తొలి మహిళా మంత్రిగా రికార్డు నెలకొలిపారు. 2023 లో ఆమె బీఆర్ఎస్ నుంచి పోటీలో ఉన్నారు.